కరువు నేలలో డ్రాగన్ సిరులు

- కొత్తరకం పంట సాగుపై రైతుల ఆసక్తి
- ఒకసారే పెట్టుబడి.. 20 ఏళ్లపాటు దిగుబడి
- మార్కెట్‌లో భలే గిరాకీ
- ఆరోగ్యానికీ పదింతల మేలు



డ్రాగన్ ఫ్రూట్‌ను చూపుతున్న రైతు రఘునాథరెడ్డి



నల్లమాడ: సూపర్‌ఫ్రూట్‌గా పిలిచే డ్రాగన్ ఫ్రూట్.. పల్లె ప్రజలు కొత్తగా వింటున్న కాయ (పంట) పేరు. ఎక్కడో మెక్సికో, సెంట్రల్ అమెరికాలో పుట్టిన ఈ పంట ప్రపంచం నలుమూలలా వ్యాపించి ఇప్పుడిప్పుడే పల్లెలకూ పాకుతోంది. వేరుశనగ, వరి తదితర సాధారణ పంటలు సాగుచేసి విసిగిపోయిన రైతన్నలు ఈ కొత్త రకం పంట సాగుపై ఆసక్తి చూపుతున్నారు. అనంతపురం జిల్లాలోని నార్పల, గార్లదిన్నె మండలాల్లో అరకొర విస్తీర్ణంలో మాత్రమే ఈ పంట సాగైనట్లు సమాచారం. శ్రీ సత్యసాయి జిల్లా నల్లమాడ మండలం సానేవారిపల్లికి చెందిన రైతు రఘునాథరెడ్డి రెండేళ్ల క్రితం 1.50 ఎకరాల విస్తీర్ణంలో డ్రాగన్ ఫ్రూట్ సాగు చేశారు. మూడో యేడాది ఇప్పటికి మూడు టన్నులు కాయలు విక్రయించగా మరో రెండు టన్నులు దిగుబడి వచ్చే అవకాశం ఉంది. అలాగే నల్లసింగయ్యగారి పల్లికి చెందిన ఆర్టీసీ ఉద్యోగి శివయ్య ఎకరా విస్తీర్ణంలో ఏడాదిన్నర క్రితం డ్రాగన్ ఫ్రూట్ సాగు చేశాడు. రెండో యేట పంట పది రోజుల్లో కోతకొస్తోందని రైతు తెలిపాడు.

పంట సాగు ఇలా..

డ్రాగన్ ఫ్రూట్ మొక్కలు పెరిగి అల్లుకోవడానికి వీలుగా ముందుగా భూమిలో 8–10 అడుగుల వెడల్పుతో గుంతలు తవ్వి రాయి, సిమెంట్ కప్పులు(స్తంభాలు) నాటుతారు. వాటిపై రెండడుగుల వెడెల్పు, రెండించుల మందంతో సిమెంట్‌తో తయారుచేసిన గుండ్రటి పలకలు లేదా ద్విచక్ర వాహనాల టైర్లు అమర్చుతారు. టైర్లు ఏర్పాటు చేస్తే ఖర్చు మరింత తగ్గుతుంది. స్తంభం చుట్టూ భూమిపై రెండించుల మందంతో ఎరువు, మట్టితో బెడ్డింగ్ ఏర్పాటు చేసి ఒక్కో స్తంభానికి నాలుగువైపులా నాలుగు మొక్కలు నాటామని ఆయా రైతులు తెలిపారు. ఒక ఎకరాకు 400 స్తంభాల చుట్టూ 1,600 చొప్పున డ్రాగన్ ఫ్రూట్ మొక్కలు (పిలకలు) నాటి డ్రిప్ పైపుల ద్వారా వాటికి నీటిని అందిస్తున్నట్లు వివరించారు. వీటన్నింటికీ ఎకరాకు రూ.5 లక్షలు చొప్పున పెట్టుబడి ఖర్చు వచ్చిందన్నారు.

ఒకసారే పెట్టుబడి.. 20 ఏళ్లు దిగుబడి

డ్రాగన్ ఫ్రూట్ పంట సాగుకు పిలకలు (మొక్కలు) నాటినప్పుడు ఒకసారి మాత్రమే పెట్టుబడి పెట్టాల్సి వస్తుంది. నేల స్వభావాన్ని బట్టి ఏడాదిన్నర నుంచి రెండేళ్లలోపు కాయలు కాసి కోతకు వస్తాయి. తర్వాత ఆరు నెలలు, ఏడాదికో ఒకసారి కలుపు తొలగించి ఎరువులు, మందులు వేసుకోవాలి. ఇలా ఒకసారి చేసుకుంటే 20 ఏళ్లపాటు డ్రాగన్ ఫ్రూట్ దిగుబడి వస్తూనే ఉంటుంది.

డ్రాగన్ ఫ్రూట్‌కు మార్కెట్‌లో భలే డిమాండ్

డ్రాగన్ ఫ్రూట్ పండ్లకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. పెద్ద పెద్ద పట్టణాలు, నగరాల్లో మాత్రమే దొరికే ఈ కాయలు సైజును బట్టి రూ.150 నుంచి రూ.300 పైన ధర పలుకుతున్నాయి. కదిరి, అనంతపురం ఇతర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు తోట వద్దకు వచ్చి కిలో(మూడు నుంచి నాలుగు పండ్లు) రూ.130 ధరతో కొనుగోలు చేసి కోసుకెళ్తున్నారు. ఇక్కడ పండే డ్రాగన్ ఫ్రూట్ పండ్లు అనంతపురం, సత్యసాయి జిల్లాల్లోని ప్రముఖ పట్టణాల్లో విక్రయించబడటమే గాక బెంగుళూరు, హైదరాబాద్, చెన్నై నగరాలకు ఎగుమతి అవుతున్నాయి.

ఎకరాకు గరిష్టంగా ఎనిమిది టన్నుల దిగుబడి

డ్రాగన్ ఫ్రూట్ నేల స్వభావం, వాటికందించే ఎరువులు, మందులు, సాగునీటి వసతిని బట్టి ఏడాదికి ఒక ఎకరాకు ఐదు నుంచి ఎనిమిది టన్నుల కాయలు దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. కిలో ధర రూ.130 అనుకున్నా ఐదు టన్నులకు రూ.6,50,000 రైతు చేతికందుతుంది. అంటే ఒక ఏడాదిలోనే పెట్టుబడి పోను ఇంకా లక్షన్నర రూపాయలు మిగులుతుంది. ఆపై ఎన్ని సంవత్సరాలు కాపు వస్తే వచ్చే రాబడి అంతా మిగులు బాటే.

ఆరోగ్యానికీ పదింతల మేలు

డ్రాగన్ ఫ్రూట్ పండు ఎర్రటి రంగుతో చూడముచ్చటగా ఉంటుంది. ఈ పండులో క్యాల్షియం, పాస్ఫరస్, జింక్, మెగ్నీషియం, ఐరన్, విటమిన్ సీ లవణాలు పుష్కలంగా ఉంటాయి. ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని శాస్త్రవేత్తలు, వైద్య నిపుణులు చెబుతున్నారు. షుగర్ జీరో శాతం ఉండే ఈ డ్రాగన్ ఫ్రూట్ బ్లడ్, షుగర్ లెవెల్స్‌ను అదుపులో ఉంచి డయాబెటిస్ నుంచి ఉపశమనం కలిగిస్తుంది. మలబద్ధకాన్ని తగ్గించి జీర్ణశక్తిని పెంచుతుంది. గుండె పరికరాలు, కాలేయం పనితీరును మెరుగుపర్చి రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. ఎముకల పటుత్వం, చర్మ, కేశ సౌందర్యానికి, పుండ్లు త్వరగా మానడానికి, మొటిమల నివారణ, కేన్సర్ సమస్యలను డ్రాగన్ ఫ్రూట్ అరికడుతుందని వైద్య నిపుణులు తెలిపారు. డ్రాగన్ ఫ్రూట్‌తో తయారు చేసిన జ్యూస్, సిరప్‌లు కూడా మార్కెట్‌లో దర్శనమిస్తున్నాయి.

ఆశాజనకంగా పంట

మూడు సంవత్సరాల క్రితం డ్రాగన్ ఫ్రూట్ పంట సాగు చేశాను. ఇప్పటికే మూడు టన్నులు కాయలు విక్రయించా. పంట ఆశాజనకంగా ఉంది. ఈ సీజన్‌లో ఇంకా రెండు టన్నుల కాయలు దిగుబడి వచ్చే అవకాశం కనిపిస్తోంది. వ్యాపారులే తోట వద్దకు వచ్చి కిలో రూ.130 ధరతో పండ్లు కోసుకెళ్తున్నారు. పంట దిగుబడి క్రమంగా పెరుగుతోంది.

– రఘునాథరెడ్డి, రైతు, సానేవారిపల్లి

ప్రభుత్వం ప్రోత్సహించాలి



డ్రాగన్ ఫ్రూట్ సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందించాలి. ఎక్కువ పెట్టుబడి పెట్టాల్సి ఉండటంతో చాలా మంది రైతులు పంట సాగుకు వెనకడుగు వేస్తున్నారు. ఇక్కడి నేల, వాతావరణం పంట సాగుకు అనుకూలం. వర్షాభావ పరిస్థితులను తట్టుకునే పంట డ్రాగన్ ఫ్రూట్. నేను ఎకరాకుపైగా విస్తీర్ణంలో డ్రాగన్ ఫ్రూట్ సాగు చేశా. నీటి సౌకర్యం, మందులు, ఎరువులకు ప్రభుత్వం సాయం అందిస్తే సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉంటుంది.

– శివయ్య, రైతు, నల్లసింగయ్యగారిపల్లి

క్లుప్తంగా

ఆర్టీసీ బస్సులు ప్రారంభం



బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

కదిరి అర్బన్: స్థానిక ఆర్టీసీ డిపోలో ఆదివారం 4 నూతన బస్సులను ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బస్సును కొద్ది దూరం నడిపారు. నాలుగు బస్సుల్లో ఒకటి నెల్లూరుకు, మూడు అనంతపురానికి నడపనున్నారు. ఉన్నతాధికారులు త్వరలో ఈ డిపోకు మరిన్ని నూతన బస్సులను కేటాయిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు పవన్ కుమార్‌రెడ్డి, అనిల్‌కుమార్ రెడ్డి, అసిస్టెంట్ డీఎం హరిత, ఏఈఎం రామకృష్ణ, కృష్ణయ్య, ఎస్ఎంయూ నాయకులు బైరిశెట్టితో పాటు పలువురు పాల్గొన్నారు.

ఉచితంగా డీఎస్సీ శిక్షణ..

కదిరి అర్బన్: మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లి స్పేస్ కళాశాలలో కందికుంట నారాయణమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన డీఎస్సీ ఉచిత శిక్షణ కేంద్రాన్నిఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ఆదివారం ప్రారంభించారు. డీఎస్సీ అభ్యర్థులు శిక్షణా కేంద్రాన్ని వినియోగించుకుని ఉద్యోగాలు సాధించాలని సూచించారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో వాల్మీకీ విద్యా సంస్థల అధినేత పవన్‌కుమార్ రెడ్డి, అనిల్‌కుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ ఎంఎస్ ప్రశాంత్ పాల్గొన్నారు.

కల్లమడప్ప స్వామి గ్రామోత్సవం



పూజలందుకున్న కొడిమి కల్లమడప్ప స్వామి

బత్తలపల్లి: మండలంలోని లింగారెడ్డిపల్లి గ్రామంలో శనివారం రాత్రి బొంతల వంశస్తుల ఆధ్వర్యంలో కొడిమి కల్లమడప్ప స్వామి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. బొంతల నారాయణ స్వామి, ఈశ్వరమ్మ దంపతులు తమ స్వగృహం నుంచి స్వామిని ఊరేగించారు. డప్పుచప్పుళ్ల మధ్య సాగిన గ్రామోత్సవంలో స్వామి పూజారుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అనంతరం విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పూజారి కల్లమడప్ప, బొంతల రాఘవేంద్ర, భారతి, రాజేష్, కేశవయ్య, శివయ్య, ప్రతాప్ కల్లమడితోపాటు వివిధ పార్టీలకు చెందిన నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఇద్దరికి గాయాలు

తనకల్లు: మండలంలోని నల్లగుట్లపల్లి సమీపంలో జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. వివరాలు.. తనకల్లుకు చెందిన కాలేషా, శ్రీనివాసులు శనివారం రాత్రి అన్నమయ్య జిల్లా మొలకల చెరువులోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరుగుతున్న పెళ్లికి ద్విచక్ర వాహనంలో వెళ్లారు. వివాహం అనంతరం అదే వాహనంలో తనకల్లుకు బయలుదేరారు. అయితే గ్రామం వద్దకు రాగానే ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో ఇద్దరు రోడ్డుపై పడ్డారు. ఈ ప్రమాదంలో కాలేషా, శ్రీనివాసులుకు బలమైన గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వందేమాతరం టీం తమ ఉచిత అంబులెన్స్‌లో క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చారు. మెరుగైన చికిత్స కోసం శ్రీనివాసులును కడపకు తరలించారు.

ధర్మవరం రూరల్ సీఐగా ఎన్.ప్రభాకర్



ధర్మవరం రూరల్: సర్కిల్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా చర్యలు తీసుకుంటామని ధర్మవరం రూరల్ సీఐ ఎన్.ప్రభాకర్ అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు. సర్కిల్ పరిధిలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు చేపడుతామన్నారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. ఎస్ఐ శ్రీనివాసులు, ఏఎస్ఐ సోమశేఖర్ మూర్తి, తిరుపాలు, సిబ్బంది సీఐని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ సీఐగా విధులు నిర్వహిస్తున్న సీఐ ఆరోహణరావు బదిలీపై పుట్టపర్తికి వెళ్లారు.

ఘనంగా శ్రీవారి కల్యాణం



ప్రత్యేక అలంకరణతో ఖాద్రీశుడు

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోని రంగమండపంలో ఆదివారం శ్రీదేవి భూదేవి సమేత వసంత వల్లభుడికి భక్తిశ్రద్ధలతో కల్యాణం జరిపించారు. తొలుత ఖాద్రీశుడిని రకరకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు మండపంలో హోమాలు నిర్వహించారు. వేద మంత్రాలు, మేళ తాళాల మధ్య శ్రీవారికి కల్యాణం జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

కృష్ణాష్టమికి అనుమతి ఇవ్వండి



ఎస్ఐకి ఆహ్వాన పత్రిక అందిస్తున్న కమిటీ సభ్యులు

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను జరుపుకునేందుకు అనుమతి ఇవ్వాలని ప్రబోధ సేవా సమితి సభ్యులు ఆదివారం ఎస్ఐ వెంకటేశ్వర్లును కోరారు. ఎలాంటి సమస్యలు లేకుండా ప్రశాంతగా జరుపుకోవాలని ఎస్ఐ వారికి సూచించారు. అనంతరం వారు మాట్లాడుతూ త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక చెన్నేకొత్తపల్లి కమిటీ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు మూడురోజుల నిర్వహిస్తామన్నారు. 26న శ్రీకృష్ణుడి విగ్రహాన్ని కొలువుదీరుస్తామన్నారు. 28 వరకూ రోజూ పూజలు చేస్తామన్నారు. 28వ తేదీన గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు అనురాధ, శ్రీనివాసరెడ్డి, చిట్టెమ్మ, కిష్టప్ప, కొల్లారెడ్డి సుబ్బమ్మ పాల్గొన్నారు.

బొమ్మిరెడ్డిపల్లిలో అటవీశాఖ అధికారుల పర్యటన



మాట్లాడుతున్న అటవీ శాఖ అధికారి రామచంద్రారెడ్డి

నల్లచెరువు: చిరుత పులి సంచారంపై గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ సెక్షన్ అధికారి రామచంద్రారెడ్డి సూచించారు. ఆదివారం మండల పరిధిలోని జోగన్నపేట పంచాయతీ బొమ్మిరెడ్డిపల్లి గ్రామంలో అటవీ శాఖ అధికారులు పర్యటించారు. చిరుతపులి సంచారం పట్ల గొర్లు, పశువుల కాపర్లతో పాటూ గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చిరుత సమాచారం తెలిస్తే వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. కాగా.. గత శుక్రవారం బొమ్మిరెడ్డి పల్లి శివారు ప్రాంతంలో చిరుతపులి సంచరించిన విషయం తెలిసిందే.

వైద్యులపై దాడులను అరికట్టాలి



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కదిరి టౌన్: వైద్యులపై దాడులను అరికట్టాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. అక్కడ మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. వైద్య విద్యార్థిని కుటుంబాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వైద్య విద్యార్థినిని హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. జిల్లా కాంగ్రెస్ నాయకులు కదిరప్ప, ఉపేంద్ర, అరుణ్, అజయ్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఆరాధనోత్సవాలు

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని గొట్లూరు గంగమ్మ దేవాలయం వద్ద సోమవారం నుంచి రెండు రోజుల పాటు రాళ్లస్వామి ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పసుపులేటి రాములు, సాకే శ్రీరాములు తెలిపారు.

రహదారి ఇలా.. ప్రయాణం ఎలా?



అధ్వానంగా మారిన తూంచర్ల- అనంతపురం రోడ్డు

కనగానపల్లి: మండలంలోని తూంచర్ల నుంచి రంగంపేట మీదుగా అనంతపురం వెళ్లే రహదారి అస్తవ్యస్తంగా మారింది. గుంతలమయంగా ఉన్న మట్టి రోడ్డు గత నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు మరింత దెబ్బతింది. రహదారి వెంట ఎటూ చూసినా నీటి మడుగులే కనిపిస్తున్నాయి. దీంతో ఈ రహదారి గుండా వెళ్లే వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రెండు రోజుల క్రితం ఈ రహదారి గుండా వెళ్తున్న ఓ ప్రైవేటు స్కూల్ బస్సు అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. బస్సు బోల్తా పడకపోవడంతో విద్యార్థులు సురక్షితంగా బయటపడ్డారు. దీనికితోడు పలువురు ద్విచక్ర వాహనదారులు కూడా ప్రమాదాలకు గురైనట్లు స్థానికులు తెలిపారు. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు స్పందించి రహదారిని బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



ఇటీవల అదుపు తప్పి రహదారి పొలాల్లోకి వెళ్లిన స్కూల్ బస్సు (ఫైల్)

సీఐ సుబ్రహ్మణ్యం సేవలు చిరస్మరణీయం



వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యంను సన్మానిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

ధర్మవరం అర్బన్: వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం ధర్మవరం ప్రజల మన్ననలు పొందారని డీఎస్పీ శ్రీనివాసులు కొనియాడారు. స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం బదిలీ అయిన సీఐ సుబ్రహ్మణ్యంను డీఎస్పీ శ్రీనివాసులు, టూటౌన్ సీఐ అశోక్‌కుమార్, రూరల్ సీఐ ప్రభాకర్, ఎస్ఐలు శ్రీనివాస్, నరేంద్ర, పోలీసు సిబ్బంది శాలువాలు, గజమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికల్లో ఎలాంటి సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు సీఐ కృషి చేశారన్నారు. స్టేషన్‌కు వచ్చే ప్రతి ఒక్కరితో గౌరవంగా మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించారని పేర్కొన్నారు. సీఐ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. ఇక్కడ ప్రజలు ఎవరి పనులు వారు చేసుకుంటూ ప్రశాంత జీవితం గడుపుతున్నారని తెలిపారు. రెండేళ్ల రెండునెలల్లో ముగిసినట్లు ఇక్కడ విధులు నిర్వర్తించామని అందుకు కారణం ప్రజల సహకారం, పాత్రికేయులు, న్యాయవాదులు, పట్టణ ప్రముఖుల సహకారం మరువలేనిదన్నారు.

నేడు రాఖీ పండుగ

పుట్టపర్తి రూరల్: శ్రావణ మాసంలో పౌర్ణమి రోజున అన్నా, చెల్లెళ్లు, అక్కా, తమ్ముళ్లు జరుపుకునే ఈ ముఖ్యమైన పర్వదినం ఇది. ఆపత్కాలంలో తమ్ముడికి అక్కలా.. అన్నకు చెల్లిలా.. ఏ రక్త సంబంధం ఉన్నా? లేకున్నా? బంధాలను పెంచి పంచేదే రాఖీ. ఎల్లలెరుగని వాత్సల్యం, అనురాగం కలకాలం చల్లగా ఉండాలని ఆకాంక్షిస్తూ.. ప్రతి సోదరీ.. సోదరుడి రక్త సంబంధాన్ని రక్షబంధనంతో ముడి వేస్తూ కోరుకుంటుంది. రాఖీ పర్వదినానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. శిశుపాలుడిని శ్రీకృష్ణుడు తన సుదర్శన చక్రంతో వధించే క్రమంలో తన వేలుకి గాయమై రక్తం కారుతుంటే పక్కనే ఉన్న సోదరి సమానురాలైన ద్రౌపది తన చీర కొంగును చించి కట్టు కడుతుంది. దీనిని రక్షాబంధన్‌గా భావించిన శ్రీకృష్ణుడు ఆపదలో తనను తలుచుకోమని వరమిస్తాడు. కౌరవ సభలో కౌరవులు ద్రౌపది వస్త్రాభరణం చేయబోగా అన్నా అంటూ తలుచుకోగానే శ్రీకృష్ణుడు ఆమెను రక్షించిన ఇతివృత్తాంతం మనకు పురాణాలు తెలియజేస్తున్నాయి.

నిత్యావసరాల పంపిణీ



వృద్ధులకు నిత్యావసరాలు అందజేసిన దృశ్యం

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని గొట్లూరు అనాథాశ్రమంలోని వృద్ధులు, అనాథలకు ఆదివారం పట్టణంలోని శ్రీ సత్యకృప డిగ్రీ కళాశాల విద్యార్థినులు బియ్యం, నిత్యావసర వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో హేమావతి, వెన్నెల, కిరణ్మయి, సౌగాంధిక, సాయిశ్రీ, అనిత, రుచిత పాల్గొన్నారు.

నిందితులను ఉరి తీయాలి



కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న ఎంఎండీఏ ప్రతినిధులు

ధర్మవరం అర్బన్: కలకత్తాలో వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను వెంటనే ఉరి తీయాలని ముస్లిం మైనారిటీ డెవలప్‌మెంట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రోషన్ జమీర్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎంఎండీఏ కార్యాలయంలో ఆదివారం కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విధుల్లో ఉన్న వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను ఉరి తీయాలని తెలిపారు. మహిళలపై మరోసారి ఇలాంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వాలు కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో ఎంఎండీఏ నియోజకవర్గ అధ్యక్షుడు సయ్యద్ దాదాపీర్, సభ్యులు ముస్కిన్ వలి, తాహెర్, ముంటు, నూరుల్లా, జిలాన్, అల్లాబకాష్, హసీనా, అమ్మాజాన్ తదితరులు పాల్గొన్నారు.

బాట మారెమ్మకు పూజలు

కనగానపల్లి: మండల కేంద్రం సమీపంలో ప్రధాన రహదారి పక్కన వెలసిన బాట మారెమ్మకు భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ఆభరణాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసిన తర్వాతా పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి



నాగరాజు (ఫైల్)

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త నాగరాజు(37) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. మృతుడు నాగరాజు కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు అనంతపురానికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య రాధతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. నాగరాజు మృతికి పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

నేడు శాంతి కమిటీ సమావేశం

కదిరి టౌన్: సెప్టెంబర్ నెలలో జరిగే వినాయక చవితి ఉత్సవాల నిర్వహణపై మంగళవారం స్థానిక ఆర్డీఓ ఆఫీసులోని కాన్ఫరెన్స్ హాల్‌లో శాంతి కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ హాజరవుతారన్నారు. ఆర్డీఓ, డీఎస్పీ, అన్ని శాఖల ప్రభుత్వ అధికారులు, వినాయక మండపాల నిర్వాహకులు హాజరుకావాలని సూచించారు.

లక్ష్మీవేంకటేశ్వర స్వామి పవిత్రోత్సవాలు



అలంకరణలో లక్ష్మీవేంకటేశ్వర స్వామి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కొత్తపేటలో వెలసిన లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం పవిత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. మూడు రోజులు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు స్వామికి ప్రత్యేక పూజలతో పాటు అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఉదయం శ్రవణా నక్షత్ర కల్యాణోత్సవం, సాయంత్రం అంకురార్పణ కార్యక్రమాన్ని భక్తుల సమక్షంలో అర్చకులు చేపట్టారు. పూజల్లో ఆలయ కమిటీ సభ్యులు మెటికల కుళ్లాయప్ప, దత్తశివ, శంకర్ సంజీవులు, సాగా సురేష్, బిల్లే నాగప్ప, రంగా శ్రీనివాసులు, గుద్దిటి రామంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

బత్తలపల్లి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సాయిమనోహర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల అధికారులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారన్నారు. అదేవిధంగా మండలస్థాయిలో జరిగే ఈ కార్యక్రమానికి మండలస్థాయి అధికారులందరూ హాజరు కావాలని సూచించారు. ప్రజలు కూడా ఏవైనా సమస్యలుంటే వినతిపత్రాలు అందజేయవచ్చని పేర్కొన్నారు.

ఒత్తిడిని జయించాలి



శిక్షణకు హాజరైన విద్యార్థులతో ధర్మవరం ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ సభ్యులు

ధర్మవరం అర్బన్: ప్రతి విద్యార్థి ఆత్మవిశ్వాసంతో ఒత్తిడిని జయించి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ధర్మవరం ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ సభ్యులు మణికంఠ, శ్రీకాంత్, సెరికల్చర్ ఈశ్వరయ్య సూచించారు. పట్టణంలోని సత్యకృప డిగ్రీ కళాశాలలో ఐదు రోజులపాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువతలో చైతన్యం కోసం రవిశంకర్ గురువు రూపొందించిన యస్ ప్లస్ కోర్సును నిర్వహించామన్నారు. ఆత్మ విశ్వాసాన్ని ఎలా పెంపొందించుకోవాలి? ఒత్తిడిని ఎలా జయించాలి, మనో బలం, ఉత్సాహం, క్రమశిక్షణగా ఎలా ఉండాలి తదితర విషయాలపై విద్యార్థులకు వివరించామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ పెద్దారెడ్డి, ధర్మవరం ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ సభ్యులు వెంకటనారాయణ, మల్లయ్య, ప్రమీల, వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

ఈ-కేవైసీ చేయించుకోండి

గాండ్లపెంట: స్థానిక వ్యవసాయ సహకార సంఘంలో సభ్యత్వమున్న ప్రతి రైతు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని సహకార సంఘం సీఈఓ షామీర్‌బాషా తెలిపారు. ఆదివారం ఆయన సహకార సంఘం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రైతుల ఖాతాలను ఆన్‌లైన్ కంప్యూటరీకరణ చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ-కేవైసీ చేయించుకోడానికి ఆధార్‌కార్డు, బియ్యం కార్డు, రెండు పాస్‌ఫొటోలు, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్, సెల్‌ఫోన్ నంబర్‌తో సహకార సంఘం కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

నీట మునిగిన వరి



న్యామద్దెలలో నీట మునిగిన వరి పంటను చూపుతున్న రైతు కాటమయ్య

చెన్నేకొత్తపల్లి: గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని వెల్దుర్తి, న్యామద్దెల గ్రామాల్లో రైతులు సాగు చేసిన వరి పంట నీట మునిగాయి. న్యామద్దెలలో కాటమయ్యకు చెందిన మూడున్నర ఎకరాల్లో నాటిన వరి మడి వర్షం నీటితో మునిగిపోయింది. అలాగే వెల్దుర్తిలో దాసరయ్యగారి చెన్నారెడ్డికి చెందిన ఒకటిన్నర ఎకరాలో సాగు చేసిన వరి మడి నీటి పాలైంది. వర్షంతో తమకు తీరని నష్టం జరిగిందని ప్రభుత్వమే ఆదుకోవాలని బాధిత రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయాన్ని రైతులు మండల వ్యవసాయాధికారి ఉదయ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు.